# కృషితో నాస్తి....

పొల్కంపల్లి శాంతాదేవి



"అమ్మాయ్, సుగుణా! ప్రభాకరం వచ్చాడు. కాళ్ళకు నీళ్ళు తీసుకురా, తల్లీ!" అన్నాడు సూర్యనారాయణ. తండ్రి కేకవిని చెంబుతో నీళ్ళు తీసుకొని పరిగెత్తుకు వచ్చింది సుగుణ. డ్రెస్సు విప్పి అడ్డపంచ చుట్టుకొంటున్నాడు ప్రభాకర్.

వారంరోజులయినా తిరగకముందే వచ్చివెళ్ళిన ప్రభాకర్ ఈసారి సూట్‌కేసేకాక బెడ్డింగూ, స్టౌ పెట్టే, మరో సామాను పెట్టెతో సహా దిగాడు.

అయోమయంగా చూచాడు తండ్రి. "సామానుతో దిగావు బదిలీగాని అయిందా?"

"బదిలీ ఎక్కడ? ఏకంగా ఉద్యోగానికే ఉద్వాసన జరిగితే!" చెల్లెలి చేతినుండి చెంబు తీసుకొని వీధిలో మెట్టుబండమీద కాళ్ళు కడుక్కొని వచ్చాడు ప్రభాకర్.

"ఏదైనా కొంపెపని చేశావా?" లంచం లాంటిది పుచ్చుకొన్నావా అని అతని భావం. కాని అట్లా అనటానికి ఆయనకు నోరు రాలేదు.

తండ్రి భావాన్ని గ్రహించిన ప్రభాకర్‌కి ఒళ్ళు జలదరించింది. "ఛ! అదేం కాదు. ప్రభుత్వపు పొదుపు ఉద్యమంలో పోయింది ఉద్యోగం." అన్నాడు నెమ్మదిగా.

వేడి నిట్టూర్పొకటి విడిచాడు సూర్యనారాయణ. "ప్రయత్నిస్తే మళ్ళీ ఉద్యోగం వచ్చే అవకాశం ఉందా?

"ఏమో, తెలియదు." ప్రభాకర్ నిరుత్సాహం వ్యక్తపరిచాడు. "అలాంటి ఆశేం పెట్టుకోకూడదు. ఎక్కడో ఏదో ఒకటి దొరికినా ఊడడానికి ఎంతోసేపు పట్టదు."

బరువుగా మూలిగాడు తండ్రి.

అర్ధకడుపుకు తినిలేచినా ఆకలిగా అనిపించలేదు ప్రభాకర్‌కు. మనస్సంతా చికాగ్గా వుంది. కంటికి కునుకు కడుదూరంలో ఉండిపోయి. పక్కమీద దొర్లడంకూడా విసుగేసి, లేచి కిటికీచెంత కుర్చీ వాల్చుకొని కూర్చుండిపోయాడు అర్ధరాత్రిదాకా. అటువంటి స్థితిలో వచ్చే ఆలోచనలకు అంతూ పొంతూ ఉండదు.

'ఇన్నాళ్ళనుండీ ఉద్యోగం మీదా, సంపాదన మీదా చూపులన్నీ నిలుపుకున్నది తనేకాదు, తన కుటుంబమంతా దానిమీదే ఆశపెట్టుకొంది. తన ఇంజనీరింగ్ చదువుకు కరణం దగ్గర చేసిన అప్పులో నాలుగోవంతైనా తీరకుండానే ఉద్యోగం కాస్తా పోయింది. తను ఉద్యోగం చేస్తేనేగాని ఆ అప్పు తీర్చేమార్గం మరి లేదు. తిరిగి, ఉద్యోగ ప్రయత్నం శక్తి మేరకు చేస్తాడుగాని అది వస్తుందని ఖచ్చితంగా ఎలా నిశ్చయించుకోగలడు? వచ్చినా అది స్థిరంగా నిలుస్తుందని నమ్మకమేమిటి? ఏ క్షణంలో ఉద్వాసన చెబుతారో తెలియదు. ఇప్పుడు జరిగినదాన్నిబట్టి తిరిగి ఉద్యోగం మీద ఆశలు నిలుపుకోవడం ఉత్త తెలివితక్కువ.

* * *

వైశాఖమాసం ఎండ మండిపోతున్నది బయట. ఎండ వేడికి ఉడికిపోతున్న మనిషిని ఇంకా హైరానాపెడుతూ, అప్పుడప్పుడూ వడగాడ్పు తప్ప చల్లగాలి లేదు. గదిలో మంచంమీద పడుకొన్న ప్రభాకర్, ఉక్కపోతకు ఒళ్ళంతా చెమటలు వేసి ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

పగటిభోజనం తరువాత ఉత్తరంవైపు గదిలో కొంగుపరచుకొని పడుకొన్న రామలక్ష్మమ్మ ఒక్కకునుకుతీసి కొంగు విదిలించి లేచింది.

కొడుకు గది ముందుకు వచ్చి, "గదిలో ఉక్కగాలేదూ? ఉత్తరంవైపు గదిలో పడుకొందువురా. చల్లగాలి వస్తోంది అక్కడ" అని చెప్పి పనిమీద లోనికి వెళ్ళిపోయింది.

తలగడా, చాపా తీసుకొని ఉత్తరం గదిలోకి వెళ్ళాడు ప్రభాకర్. గుమ్మానికి తలజేసి పడుకొన్నాడు. అవతల వేపచెట్టు నీడ చిక్కగా పరుచుకొని చల్లనిపిల్లగాళ్ళు నెమ్మదిగా లోనికి సాగివస్తున్నాయి. కాస్సేపటిలోనే ఒంటిమీది చెమటలన్నీ ఆరిపోయి చల్లగా నిద్రపట్టిన ప్రభాకర్ తల్లి పిలుపుకు మేలుకొన్నాడు.

"గోపాలం మామయ్య వచ్చాడురా!"

బనీను లేవి భుజాలమీద తువాలు కప్పుకొని వసారాలోకి వెళ్ళాడు ప్రభాకర్.

"ఉద్యోగంనుండి తీసివేశారటకదా?" అన్నాడు గోపాలం.

"ఉఁ."

"మళ్ళీ ప్రయత్నిస్తే ఉద్యోగం రాకపోతుందా?"

"రాకపోదుకాని, నిలుస్తుందని గ్యారంటీ లేదు."

"ఇంత చదివీ ప్రయోజనమేమిటి? నిరుద్యోగంగా ఇంట్లో కూర్చోడానికేనా?"

"అంతా మన ఖర్మ, అన్నయ్యా! లేకపోతే, ఇంతపెద్ద చదువు చదివి ఏదో నెత్తికెత్తుతాడనుకొంటే ఉద్యోగం ఊడి ఇంటికి రావడమేమిటి?" రామలక్ష్మమ్మ ఉదాసీనంగా అంది. చల్లని నిమ్మకాయషర్బత్తు గ్లాసుల్లో తెచ్చి చెరొకటియిస్తూ "ముహూర్తం కొంచెం ఆలస్యంగా పెట్టుకొన్నా సరే, నిశ్చితార్థమైతే జరిగిపోనీ – అంటున్నాడురా మీ మామయ్య" చెప్పింది కొడుకుతో. గోపాలంవైపు తిరిగి మళ్ళీ అంది: "మొన్న నువ్వామాట అన్నాక శాస్త్రిగారిని పిలిచి అడిగాను. రేపటి దశమి నిశ్చితార్థానికి యుక్తంగా ఉంటుందని అన్నాడు. గట్టి మాట చెబితే దానికి కావలసిన పనులు చేసుకోవచ్చును. ఏం, అన్నయ్యా?"

"ఇంత తొందరగా–దశమిరోజు కాదులే, అమ్మా. నాకు వేరే అవసరమైన పనులున్నాయి. మీ వదినకుకూడా ఒకమాట అడగాలికదా?" తొందరగాలేస్తూ అన్నాడు గోపాలం.

అలా వెళ్ళిపోతున్న అతడిని వింతగా చూచింది రామలక్ష్మమ్మ.

గోపాలం ఒక్కగానొక్క సంతానం. సరళ ఈడొచ్చిన పిల్ల. కొద్దిగా దూరపు బంధుత్వమే అయినా గోపాలం ప్రభాకర్‌కు మామవరుస అవుతాడు. ప్రభాకర్ ఇంజనీరింగ్ ఫైనలియర్‌లో ఉన్నప్పటినుండే తన కూతురిని అతడికి ఇస్తానంటూ సూర్యనారాయణ ఇంటిచుట్టూ తిరుగుతున్నాడు. ఆ సంబంధం ఖాయమయ్యేప్పటికి ప్రభాకర్ అసిస్టెంట్ ఇంజనీరుగా ఉద్యోగంలో ప్రవేశించడం జరిగింది.

ఇంజనీరును అల్లుడిగా పొందుతూ పదివేలు వరకట్నం క్రింద ఇవ్వడానికి సునాయసంగా ఒప్పుకొన్నాడు. ఊళ్ళో ఒకమాదిరి కలవాడుగా అనిపించుకొన్న గోపాలం. అయినా ప్రస్తుతం తన కుటుంబ పరిస్థితి అంత బాగుండలేదని, పెళ్ళికి కొద్దిగా ఆగా

లవి. ఈలోగా సుగుణకుకూడా మంచి సంబంధంచూచి అన్నా చెల్లెళ్ళ వివాహాలు ఒకేసారి దాటించే ఉద్దేశ్యంతో వున్నానని అన్నాడు ప్రభాకర్ తండ్రి.

"ఈడొచ్చిన పిల్లను ఇంకా ఎంతోకాలం ఇంట్లో వుంచుకొని నిశ్చింతగా ఉండలేం కదా? పోనీ, తాంబూలాలైనా పుచ్చుకొందాం" అన్నాడు గోపాలం.

అలాంటిది, ఆడపిల్ల తండ్రి తాము ముందుకి తూగినా అతడు తాత్సారం చెయ్యడమేమిటి? ఈ మార్పు. ప్రభాకర్ ఉద్యోగంపోయి ఇంటికి రావడం కాదుకదా? అనుకొంది రామలక్ష్మమ్మ.


* * *

"మనిషి మాటకు కట్టుబడివుండడం ఎన్నడో పోయింది. అయినా ఇంత అన్యాయమా? ఎక్కడ మాటతప్పినా కుదిరిన పెళ్ళి విషయంలోనా?" బయటినుండి గొణుగుతూనే వచ్చాడు సూర్యనారాయణ. "విన్నావా?" భార్యను కేకేసి పిలిచి చెప్పాడు. "గోపాలం తన కూతురికి మరో సంబంధం చూస్తున్నాడట."

తాంబూలాలు పుచ్చుకొందామా అన్న రోజు గోపాలం నిరుత్సాహంగా లేచిపోయినప్పుడే ఇలాంటిదేదో జరగొచ్చునని అనుమానించిన రామలక్ష్మమ్మ, భర్తచెప్పిన మాటకు అంతగా విస్తుపోలేదు.

'సూర్యనారాయణ కొడుక్కి మాటయిందది విన్నాను. మళ్ళీ ఏవో సంబంధాలు అంటున్నావేమయ్యా?' అని అడిగాడట మన కరణం రామారావు.

'అనుకొన్నారుటా. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయటా, పిల్లాడి ఉద్యోగం పోయిందిటా, మళ్ళీ ఉద్యోగం వచ్చే అవకాశం వున్నా, అదీ నమ్మతగ్గది కాదంటున్నారుట. ఎంతపెద్ద చదువైతేనేం, ఉద్యోగం సద్యోగం లేనివాడికి అంతడబ్బు కుమ్మరించి యివ్వడమెలాగటా? ఇంట్లో తులమో ఫలమో బంగారం లేకపోయినా. పెద్ద భూమీపుత్రా లేకపోయినా పిల్లాడు




పెద్ద ఉద్యోగం చేస్తున్నాడుకదా—పిల్లను సుఖపెడతాడుకదా అనుకొన్నారటా. ఆ ఉద్యోగమే లేకపోయాక ఇక ఏం చూచి యివ్వాలి," అన్నాడట సూర్యనారాయణ.

"మరి అంతేకదా? వాడిచదువూ, సంపాదనా చూచికాక మనం ఏమంత ఆస్తిపరులమని పిల్లను పదివేల కట్నంతో మనింటికి ఇస్తాడు? ఈ ఊళ్ళో అతడికి వున్న పలుకుబడిముందు మన పలుకుబడి ఎంత?"

"వాడితో మనం సరితూగలేకపోతే పీడ పోయిందిగాని అంతటి అపురూపమైన పిల్ల మనవాడికి దొరక్కపోదు," విసురుగా అన్నాడు సూర్యనారాయణ. "వచ్చిన చిక్కు అదికాదు. ఇక్కడ పదివేల కట్నంతో సంబంధం కుదిరిందికదాఅని, సుగుణకు ఆ కట్నం డబ్బుల్లో కొంత తీసిచ్చి కాస్త ఉద్యోగం అదీ వున్నవాడిని చూచి యిద్దామనుకొన్నామా? మొన్న వచ్చిన నాగాపురం సంబంధం నాలుగువేల కట్నంతో కుదిరిపోతుందని అన్నాడు మధ్యవర్తి. ప్రభాకర్‌కు వచ్చే ఆ పదివేల కట్నం ఆశతోకాక మరే ఆధారంతో మన పిల్లకు అంత కట్నంతో ఆ సంబంధం ఖాయం చేసుకోగలం?"

తెలిసో, తెలియకో ఏదో ఒక మాట అందివ్వడమేగాని ఇలాంటి సమస్యలు ముందుకు వచ్చినప్పుడు గొప్ప పరిష్కార మార్గం చూపగలగటానికి రామలక్ష్మమ్మ 'కార్యేషు మంత్రి' మట్టుకుకాదు. "అబ్బాయితో ఆలోచించిచూడండి," అనేసి లోపలికి పూర్తిపోయింది, సగంలో ఆపివేసిన పని వెళ్ళిచేసే తొందరలో.

తన ఉద్యోగానికి ఏమైనా అవకాశాలు ఉన్నాయేమోనని దినపత్రిక చూస్తున్నాడు ప్రక్కగదిలో, ప్రభాకర్. ఓ చెవి అప్పగించి తల్లిదండ్రుల సంభాషణకూడా విన్నాడు. తను ఉద్యోగం కోల్పోవడంవల్ల తనకుటుంబం ఎలాంటి సందిగ్ధావస్థలో చిక్కుకుందో చూస్తూ ఒక నిట్టూర్పువిడిచాడు.

"ఉద్యోగం లేనివాడికి తన కూతురిని యివ్వడట గోపాలం!" గదిలోకి వస్తూ ఉక్రోషంగా అన్నాడు తండ్రి.

ప్రభాకర్ ఉలుకూ పలుకూ లేకుండా కూర్చున్నాడు. గోపాలం మాట తప్పడం అతడికంత బాధ కలిగించలేదు. ఇందువల్ల చెల్లెలికి సంబంధం కుదరడం కష్టమౌతుందే అన్న ఆలోచన తప్ప గోపాలం కూతుర్ని అంత యిష్టతతో అంగీకరించలేదు అతడు. అతడు కోరుకొనే అందం, సంస్కారం, సరళతా ఆ పిల్లలో అంతగా లేవు. అయినా పెద్దవారి మాటకు ఎదురాడి ఇంట్లో మన స్పర్ధలు రేపడం యిష్టంలేక 'ఆ సంబంధం ఖాయపరుస్తున్నాం' అని తండ్రి అన్నప్పుడు మౌనం వహించాడు.

''వాడు చేసిన మోసానికి ఎన్ని పనులు చెడిపోతున్నాయో చూడు. నాగాపురం సంబంధం స్థిరపరచుకోడానికి ఆధారం లేకుండా పోయిందా? ఇద్దరి పెళ్ళిఖర్చులు పోగా కాస్తోకూస్తో మిగులుబాటు అవుతే ఆ కరణం బాకీ క్రింద కట్టివేద్దామనుకున్నాను. నీ ఉద్యోగం పోయిందని తెలుస్తూనే తన అప్పుకు నీళ్ళొదలి కూర్చున్నాడాయన. మంచివాడు కనుక వచ్చి గొంతుమీద కూర్చోలేదు గాని మరొకరు మరొకరు అయితే ఈపాటికి ఇంటినో, పొలాన్నో వేలం వేయించేవారు!"

ఆ సంగతినిజమే. తండ్రికీ రామారావుకూ వున్న చిన్ననాటి చెలిమో, తమ గ్రామం నుండి ఒకరిద్దరైనా పెద్దచదువులకు వెళ్ళిన కుర్రాళ్ళు వుండాలనో ఆయన చూపిన ఔదార్యంవల్ల, చేసిన సాయంవల్ల తను బి. యి. కాగలిగాడు. తన చదువు పూర్తి అయ్యేప్పటికి మూడువేలదాకా అప్పు అయింది ఆయన దగ్గర. నోటూ పత్రా లేవీ లేకుండానే అంత డబ్బూ ఆయన ఇచ్చాడు. తను ఉద్యోగంలోచేరి మొదటిజీతం అందు కొన్నప్పటినుండే కొంత అప్పుక్రిందికి పంపుతున్నాడు. మరో ఏణ్ణర్థంపాటు పంపితే ఆయన అప్పు పూర్తిగా తీరిపోయేది. ఇంత లోనే ఉద్యోగం కాస్తా పోయి ఇంటికివచ్చి కూర్చొన్నాడు. ఇప్పుడు అన్నీ విషమ సమస్యలే తనను చుట్టిముట్టి ఊపిరి ఆడ కుండా చేస్తున్నాయి.

"సంబంధం తప్పిపోతే సుగుణకు మళ్ళీ ఇంత అనుకూలమైన సంబంధం రావడం కష్టం!" సాలోచనగా అన్నాడు సూర్యనారాయణ. "ఏం చేద్దామంటావో చెప్పు! పొలం తాకట్టు పెడదామంటావా?"

"ఇంత డబ్బు తగలేసి, ఇంతచదువూ చదివావేగాని ఉద్యోగం చేయగల ఆశ లేకుండా పోయిందా? ఉన్న ఆ నాలు గెకరాల పొలమూ కుదువబెట్టితే ఆ తర్వాత ఏంచేద్దామని?"

'ఆడపిల్ల పెళ్ళంటే వీడి కేం తాపత్రయము లేనట్టుంది!' కినుకగా చూచాడు కొడుకవంక. "నువ్వు ఉద్యోగం చేసి మమ్మల్ని ఉద్ధరించగలవన్న ఆశ నువ్వు పెట్టేబేడా నెత్తినేసుకు ఇంటికి వచ్చిననాడే వదులుకొన్నాను. ఈడొచ్చిన ఆడపిల్లను ఎంతకాలమో ఇంట్లో ఉంచుకోలేం. తల తాకట్టుపెట్టి అయినా దాన్నో ఇంటిదాన్ని చేయాలి! ముందు అందుకు మార్గం చూడు."

తన అసమర్థతను ఎత్తిపొడుస్తూ తండ్రి నిష్ఠూరంగా అన్నమాటలకు దెబ్బతిన్న అభిమానంతో, కొంచెం పెడసరంగా అన్నాడు: "ఆడపిల్లను ఒక ఇంటిదాన్ని చేయటంలో మీ కెంత బాధ్యతవుందో నాకూ అంతా వుంది. కాని, దాని పెళ్ళిచేసి మనం చిప్పతీసుకొని వీధిని బడడం మాత్రం నేను ఒప్పుకోను. కొద్దిగా ఆగితే, ఎవడో ఇచ్చే కట్నండబ్బులతో కాకుండా, ఏ అప్పుసప్పు లేకుండా దానిపెళ్ళి సలక్షణంగా జరిపిస్తాను."

"మనం ఆగుతాం కాని ఆ వచ్చిన సంబంధం ఆగదు!"

"ఆగకుంటే పోనివ్వండి. ఏదో ఇంత చదివి నాలుగురాళ్ళు తెచ్చుకొంటే చాలు ననుకొని పిల్ల నివ్వడానికి తయారయ్యే రోజులు పోయాయి. ఈ రోజుల్లో చాలా ఉద్యోగాలు పర్మినెంటుకావు. భూమీ, పుట్రా, ఇంట్లో తులమో ఫలమో బంగారం, పిల్లాడికి సంసారం నేర్పుగా దిద్దుకోగల తెలివీ-అవి ఉన్నాయోలేవో చూచుకోవాలి. ఇప్పుడు వచ్చిన సంబంధానికి బి. ఏ. చదువూ, ఉంటుందో ఊడుతుందో తెలియని గుమాస్తాగిరీ తప్ప సెంటు భూమికూడా లేదా! ఆ ఉద్యోగమేపోతే వాళ్ళకు మరో బ్రతుకు తెరువు ఏముంటుంది? కనీసం డొక్కలో కాళ్ళుదూర్చి పడుకోడానికి స్వంతకొంపంటూ కూడా ఒకటి లేదు. ఆతరువాత మనంచేసిన నిర్వాహకానికి ఆడపిల్ల ఉసురు మనకు తగలడానికా?"

---

'మాటలు మూటలు' — జవాబులు

1) 'నన్ను గురించి కథ రాయవూ?' అనే కథలో బుచ్చిబాబు.
2) 'బ్రతికినకాలేజీ' అనే నవలలో పాలగుమ్మిపద్మరాజు.
3) 'సాక్షి' రూపకంలో ముళ్ళపూడి వెంకటరమణ.
4) 'హౌస్ సర్జన్' అనే నవలలో కొమ్మూరి వేణుగోపాలరావు.
5) 'కొత్తపద్ధతులు' అనే కథలో కొడవటిగంటి కుటుంబరావు.
6) 'నల్ల మేక' అనే కథలో రాచకొండ విశ్వనాథశాస్త్రి.
7) 'మంగమ్మ' అనే నవలలో గుడిపాటి వెంకటచలం.
8) 'అసమర్థుని జీవయాత్ర' అనే నవలలో త్రిపురనేని గోపీచంద్.

కొడుకు ముందుచూపు ఆయన తొందర పాటును ఎత్తి చూపకపోలేదు. కాని, తన ముందు పుట్టిపెరిగిన కుర్రాడిముందు తన ఓటమిని ఒప్పుకోడానికి అభిమాన మేసింది. "తీసుకురా. ఎలాంటి సంబంధం తీసుకు వస్తానో చూడనా? ఇక అప్పు చేయకుండా ఎలా చేస్తావో-ఎవ డింటికి కన్నమేస్తేనో తప్ప!" విసురుగా లేచిపోయాడు.

తండ్రిరాకతో సగంలో ఆగిపోయిన ఉద్యోగాన్వేషణ తిరిగి కొనసాగించకుండానే ఆలోచనల్లో కొట్టుకుపోయాడు ప్రభాకర్. అసలు ఉద్యోగం దొరుకుతుందో లేదో, దొరికినా ఎప్పుడు ఊడుతుందో తెలియదు. ఇలాంటి ఉద్యోగంకోసం ప్రాకులాడ్డం, దీనిమీదే దృష్టిని కేంద్రీకరించి మరోమార్గం చూచుకోకపోవడం చాలా తెలివితక్కువ. తనకు ఉద్యోగం పోవడంతో తనను ఓ మనిషిగా గుర్తించడానికే ఒప్పుకోడంలేదు, ఊరివాళ్ళూ, చివరికి తండ్రికూడా. ఉద్యోగము లేకపోయినంత మాత్రాన్నే తనో నిరర్థకప్రాణి అయిపోయాడా? ఉద్యోగం ద్వారా తప్ప మరోవిధంగా తన వ్యక్తిత్వం, ప్రత్యేకత, ప్రతిభ వ్యక్తం చేసుకోలేడా?

మనిషి కాలు నిలదొక్కుకోడానికి ముఖ్యముగా మూడుకావాలి. అర్థం గడించి పెట్టగల విద్య. పూర్వీకులు సంపాదించిన భూమీపుట్రా, లేదా నగదుపైకం. కాకపోతే, నగలంటే మోజో, సహజమైన స్త్రీ ఆసక్తో-ఆడవాళ్ళు చేర్చిపెట్టే బంగారం.

ఏదో తిండిగింజలకు కొరతలేకుండా నాలుగెకరాల పల్లం పదియెకరాల మెరకా తప్ప చెప్పుకోతగ్గ పొలాలు లేవు తమకు. తల్లి చెవులకు ఏడురాళ్ళ కమ్మలు తప్ప మరో వీసమెత్తు బంగారంలేదు. ఇంట్లో. పెట్టుబడిలేకుండా పెరిగిపోవాలని కలలు కంటే లాభ మేమిటి? ఆధారంలేని ఆశలను అదృష్టం వెక్కిరించదూ?

'ఉద్యోగం పోయిందటకదా?' అని అడిగే వాళ్ళకు సమాధానం యివ్వడానికి చిన్నతన మనిపించి, వచ్చినప్పటినుంచి ఇల్లువదలని



ప్రభాకర్, తన తలకాయలో మెరుపులాంటి ఆలోచన రావటంతో, ఆ సాయంకాలం, గుమ్మం వొదిలి బయటపడ్డాడు.

* * *

"ఒరే, ప్రభాకర్! ఇంటిదిక్కుగుండా రాకెట్‌లా దూసుకుపోతున్నావేం! అంత తొందరపనా?" వరండాలోంచి వీధిలోకి వేగంగా వచ్చాడు వేణు. "వచ్చినప్పటి నుండి ఇటుకేసే రావడం లేదేం?"

"తరువాత కలుస్తా." ఆగకుండా ముందుకు నడిచాడు ప్రభాకర్. వేణు తన ప్రాణస్నేహితుడు. ఎప్పుడు వచ్చినా విడవకుండా కలిసి తిరిగేవాడు. ఏమిటో, ఇప్పుడు ఎవరితో కలవాలన్నా ఉత్సాహంలేదు.

తలవంచుకొని గబగబా నడవసాగాడు;

"ప్రభాకరమేనా ఆ వెడుతున్నది? మనిషిలో ఇదివరకటి కళాకాంతులు లేవు!"

ఓరగా చూశాడు ప్రభాకర్. గోపాలం ఇంటి వరండాలో, గోపాలంతో కూర్చొన్న ఓ పెద్దమనిషి అంటున్నాడు.

'తనకు ఉద్యోగం పోయిందని కదా వీళ్ళ సానుభూతి. అదో చిన్న చూపు! బోడి ఉద్యోగం పోతే పోయింది! దాన్ని తలదన్నే గౌరవహోదాలు సంపాదించుకొంటాను!" అనుకున్నాడు ప్రభాకర్.

వరండా ప్రక్కగది కిటికీలో సరళ ముఖం కనిపించింది. ఇదివరకు ఏ ఆడవాళ్ళు తనకేసి చూచినా గర్వంతో పొంగిపోయేవాడు. అప్పుడు తన దేహసౌష్ఠవం మీదికంటె తనచదువూ హోదామీదే ఊహ

పోయేది. తన ఇంజనీరు పదవే ఆడపిల్లలను అతిగా ఆకర్షిస్తుందనుకొనేవాడు.

ప్రభాకర్ చూపు కలపగానే సరళ ముఖం ప్రక్కకు తొలగిపోయింది చటుక్కున.

ఆ పిల్ల అంటే పెద్ద ఆసక్తి ఎప్పుడూ లేదు ప్రభాకర్‌కు. ఆమె తనకు నిశ్చయమైందని తెలిశాక కూడా ఆమెతో సంబంధించిన ఊహ లేవీ తనకు ఎప్పుడూ చుట్టుముట్టలేదు. వేణు ఇంటికి ఎన్నిసార్లో వచ్చాడుగాని ప్రక్క ఇల్లే అయిన గోపాలం ఇంటికేసి ఎప్పుడూ చూపు పోనిచ్చేవాడు కాదు.

మరి, ఈ సంబంధం యిలా తప్పిపోవడం సరళమీద ఎలా పనిచేసిందో మాత్రం ప్రభాకర్‌కు తెలియదు! తెలుసుకోవాలన్న కుతూహలంకూడా లేదు!

వరండాలో జంబుఖానామీద డెస్క్ ముందు కూర్చొని ఏవో కాగితాలు పరిశీలిస్తూ కనిపించాడు రామారావుగారు.

వచ్చినపని గుర్తుకువచ్చి కొద్దిగా సంకోచించాడు ప్రభాకర్ 'తను వెళ్ళి కూర్చుంటూనే, నీ చదువుకు యిచ్చిన బాకీ ఏం చేశావ్' అని అడిగితే దానికి సమాధానం ఇవ్వలేడు సరికదా, ఇంకా తను వచ్చిన పని ఎలా బయటపెట్టగలడు? ఆ బాకీ సంగతి ముందు వెళ్ళదీయకపోయినా, తను వచ్చినపని బయటపెట్టాకయినా 'నీ చదువుకిచ్చిన బాకీ సున్నచుట్టారు. పైగా ఇదొకటా! అంటాడేమో!' సంకోచం అడ్డుపడి గేటులోనే ఆపివేసింది కాస్సేపు. నిజంగా, ఆయన యిచ్చిన బాకీ సగమైనా చెల్లుబడి కాలేదు. అది అలావుంచి, ఆయన దగ్గరకే మరోపనిమీద రావడం సిగ్గుచేటుగానూ, తెలివితక్కువగానూ లేదూ?

అరక్షణం వెనక్కితిరిగి వెళ్ళిపోదామనిపించింది. తరువాత – తండ్రి నిష్ఠూరాలు, తన ప్రతిజ్ఞలూ, ఆపైన తన ఆలోచనలూ గుర్తుకొచ్చాయి.

'బాగుపడే ఉద్దేశ్యంతోనే ఈ పని తలపెట్టి వచ్చాను. దానికి ఈయన్ని అర్థించక తప్పదు. సంకోచంతో వెనుదిరిగి వెళ్ళిపోతే ఒరిగేదేమిటి? ధైర్యం చేయకపోతే లాభంలేదు. 'అయినా అదృష్టం పిలుపు వినడంకోసమే వచ్చి చెవిలో చేతులుదూర్చి వెనక్కి పారిపోవడం ఏం తెలివి?' అనుకొని, తెచ్చుకొన్న ధైర్యంతో, పెంచుకొన్న ఆశలతో గబగబా ముందుకే వెళ్ళాడు ప్రభాకర్.

అడుగుల సవ్వడికి తలెత్తి చూశాడు రామారావు. "ఓ! ప్రభాకరమా? రావయ్యా! వచ్చి ఇన్నిరోజులైతే ఇప్పుడు కనిపిస్తున్నావు. ఇప్పుడు తీరికైందా?" దరహాసముతో ఆహ్వానించాడు.

జోళ్ళ స్తంభం ప్రక్కగా వదిలి జంబుఖానా మీదికి వెళ్ళి కూర్చొన్నాడు ప్రభాకర్.

సంభాషణ ఎటు దారితీస్తుందో, ఆయన బాకీసంగతి ఎత్తితే తను ఎంత యిరకాటములో పడిపోవాలో అనుకొని మధనపడసాగాడు.

"పనీ పాటాలేకుండా ఇంట్లో ఏమైనా తోస్తుందా? నీలాంటివాడికి తోచడానికి ఏమున్నాయి ఈ పల్లెకొంపల్లో?"

"నిజమేనండీ – కాలక్షేపంకాక తన్నుకు చస్తున్నాను. అక్కడ ఉండగా తిండీ, నిద్రా, డ్యూటీ అన్నీ టైం ప్రకారం జరిగిపోయేవి. ఇక్కడేముంది? తిండీ నిద్రా తప్పితే మరో పనిలేదు."

"అసలు, మనప్రభుత్వంపని అయిపోయిందయ్యా! కాకపోతే, బి. యి. ఫస్టు క్లాసులో పాసైనవాడివి – నీ దగ్గర ఎన్ని తెలివితేటలు, సామర్థ్యం ఉండవచ్చు! ఇలాంటివాడితో సక్రమంగా పనితీసుకోలేక నీ ప్రాణానికొక నిరుద్యోగ సమస్య పారవేసి ఇంటికి పంపించడమా?

"తెలివైనవాడు దేశానికి ఎంత ఉపయోగపడతాడో, పరిస్థితులు సక్రమంగా లేకపోతే అంతగా ప్రమాదకారి అవుతాడు. డిటెక్టివ్ పుస్తకాల్లో చూడు! అందులో విలన్లు చాలామట్టుకు అఖండమైన తెలివితేటలూ, అతిమొండి సాహసమూ కలవాళ్ళే ఉంటారు. వాళ్ళను ప్రభుత్వమూ, ప్రజలూ సక్రమంగా ఉపయోగించుకోక పోవడంవల్లే వాళ్ళలో దుష్టభావాలు విజృంభిస్తాయి..."

ఏభై యేళ్లు పైబడిన ఈ రావుగారికి డిటెక్టివ్ పుస్తకాలపిచ్చి బోలెడు వుంది!

చిరుహాసం చేస్తూ అన్నాడు ప్రభాకర్: "ఆ మాట నిజమేనండీ. ఇలాగే పని లేకుండా కూర్చొంటే నాలోనూ పుట్టవచ్చు – సంఘ విద్రోహమైన భావాలు."

"అలా కాకూడదు. ఆ బోడి ఉద్యోగం పోతేపోయింది. నీతో సక్రమంగా పని తీసుకోలేని వాళ్ళఖర్మ అది. నువ్వు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడివైన ఇంజనీరువి! నీ శక్తి సామర్థ్యాలు మరోవిధంగా దేశ నిర్మాణానికి ఉపయోగించు."

అటువంటి ఆశలు నాలోనూ ఉన్నాయి. చదువుతున్న రోజులనుండీకూడా నా శక్తి సామర్థ్యాలను, విద్యా విజ్ఞానాలనూ నీతిగా, నిజాయితీగా దేశసౌభాగ్యానికే ఉపయోగించాలని కలలుకన్నాను. అది గవర్నమెంటు సర్వీసుద్వారా వ్యక్తం చేయగల అవకాశం పోయింది. మరోవిధంగానైనా నేను దేశానికి ఉపయోగపడే మార్గంకోసమే వెదుకుతున్నాను. మార్గాలైతే ఎన్నో వున్నాయి. కాని, నా ఆర్థిక దుస్థితివల్ల అవేవీ నాకు అందుబాటులో కనిపించడంలేదు."

"నీ కేంకావాలో చెప్పు!" ఉత్సాహంగా అడిగాడు రామారావు.

"కొత్త పద్ధతుల్లో వ్యవసాయం ప్రారంభించి చూద్దామని ఉంది."

"ఆలోచన బాగుంది. నీకూ, దేశానికీ ఉపయోగపడే ఆలోచన."

"కాని, దానికి చాలినంత పొలం లేదు. పెట్టుబడీ లేదు."

"ఊఁ."

"ఈ విషయంలోనే మీ సహాయం అర్థించి వచ్చాను. సాగుబడికి కొంత భూమి, దానికి తగిన పెట్టుబడీ ఇవ్వండి. ఇప్పటికే యివ్వాల్సినబాకీ పక్కకుపెట్టి మళ్ళీ ఇదొకటి అడగడానికి వచ్చావా – అనకండి. మీ

దయవల్ల నేను బాగుపడగలిగితే మీ ఋణం ఉంచుకోను. ఇది నమ్మండి."


"నమ్మకపోతే నేను చేయగలిగిందేమీ లేదు. నీ చదువుకు పెట్టిన అప్పు ఇప్పుడు కక్కమని నీ గొంతుమీద కూర్చొన్నా ఊపిరాడక నీ ప్రాణంకాస్తా పోతుందేగాని నా బాకీ మాత్రం చెల్లుబడికాదు. అవునా? అలాగే నువ్వు పైకివచ్చి ఇవ్వగలిగిన నాడే ఇద్దువుగానీ..

"సాగుబడికి పొలం అడుగుతున్నావు. మంచిమాటే. రాళ్ళపల్లి బావి తీసుకో. కాస్త దూరం అవడంతో అక్కడి సేద్యం అంతశ్రద్ధగా చూడడంలేదు. ఈ కరణీకం లెక్కల్లో, ఇక్కడి పొలాల్లోనే నాకు కుస్తీ పట్టినట్టుగా ఉంటుంది, నాశ్రద్ధ అంతంతే కనుక రాళ్ళపల్లి పొలం అంతంతే పండు తుంది. నువ్వు శ్రద్ధగా చూచుకొన్నావంటే ఎకరానికి మూడుపుట్లు అవలీలగా రాలు తుంది గింజ — ఏం? సాగుకు తీసుకొని చెయ్యి. ఇంకా కావాలంటే పాపాల్రావు చెలకవుంది. వేరుసెనగ వెయ్యి. బాగా పండుతుంది. చాలా? ఇక, పెట్టుబడి ఎంత కావాలేమిటి?"

"ఇప్పుడే చెప్పలేను. కొంచెం నిదానంగా లెక్కలూ అవీవేసి చూచి తరువాత వచ్చి చెబుతాను."

"మంచిది. అనుకొన్నది ఆలస్యం లేకుండా ఆచరణలోపెట్టు. తొలకరి వస్తోంది. అన్నిటికీ సన్నాహాలు త్వర త్వరగా పూర్తిచెయ్యి. పైకానికేమీ ఇబ్బంది పడకు.. అవసరమైనప్పుడల్లా వచ్చి అడుగు."

కృతజ్ఞతనిండిన ముఖంతో ఆయన దగ్గర సెలవు పుచ్చుకొని తిరిగివచ్చాడు ప్రభాకర్. నిజంగా నాకు అదృష్టం కలిసి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. కాకపోతే, ఎంతో బెదురుతూ వచ్చినపని ఇంత సుగమంగా జరిగిపోతుందా?' అనుకొన్నాడు తృప్తిగా.




రాత్రి అమ్మ పెట్టిన భోజనం ఆనందంగా ఆరగించి ఆరుబయట మంచం వాల్చుకు పడుకొన్న ప్రభాకర్‌లో ఏవో ఊహలు రెక్కలు విప్పుకొంటున్నాయి.

చిన్నప్పటినుండి తనలో ఊహ అధికం. సంఘంలో తనకు బాధకలిగించే విషయం ఏది జరిగినా, ఏవిధమైన కుళ్ళు కనిపించినా, పెద్దయ్యాక వాటి సంస్కరణకు నడుం కట్టాలనుకొనేవాడు. సమాజంలో పెద్ద చైతన్యం తెచ్చి పునాదులతోసహా పెళ్ళగించి పారవేసి నవనిర్మాణం గావించాలనుకొనే వాడు. కాస్త బుద్ధి వికసించి దినపత్రికలు చదవడం అలవాటు చేసుకొని ప్రభుత్వ యంత్రాంగంలోని అవకతవకలు అవగతమౌతుంటే ఈ ప్రభుత్వాన్ని నెలకొల్పాలన్న ఆవేశం రేగిపోయేది. భవిష్యత్తులో తనొక పెద్ద సంస్కర్త అయిపోయినట్టు కలలు కనేవాడు.

తన ఊహాలు యధార్థరూపం ధరించ డానికి పరిస్థితులు అంతసుగమంగా ఉండవని తోచేసరికి ఆవేశం అలాగే చప్పబడి పోయింది.

ఇంజనీరింగ్ కోర్సులో చేరిపోయాక అతడి మనసు పూర్తిగా చదువుకూ, చదువు పూర్తి అయ్యాక ఉద్యోగ ధర్మంలో ఎంత నీతిగా, నిజాయితీగా నడుచుకోవాలో, అందులో ఏ విధంగా పరిపూర్ణ వ్యక్తిత్వం ప్రదర్శించాలో — అలాంటి ఆలోచనలకూ, ఆశయాలకూ అంకితమైంది. ప్రభుత్వం పొదుపుఉద్యమం ధర్మమా అని ఆ ఆశయాలు కూడా రూపుధరించే అవకాశం పోయింది.

ఈ విధంగా పల్లెటూరిలో స్థిరపడి పోవలసి వస్తుందని వెనుకటికి అతడెప్పుడూ అనుకోలేదు. ఈ అవకాశం మరొకరకమైన సంస్కరణాభిలాషను రేపుతున్నది. వ్యవసాయ రంగంలో కొత్తపద్ధతులు ప్రవేశపెట్టి తక్కిన కర్షకులకు ఆదర్శం కావాలనీ, ఈ పల్లీయులలోని మూఢసంకుచిత భావాలు రూపుమాపి సంస్కరణయుతమైన మార్పు తీసుకు రావాలనీ —

* * *

"ఇదేనయ్యా. ఎర్రోడి చెలక. అయి దేళ్ళనాడు నిమ్మతోట పెట్టానుగాని శ్రద్ధ లేక కొన్ని ఎండిపోయి. కొన్ని పురుగు పట్టి పోయాయి, అప్పటినుండి మళ్ళీ తోటల జోలికి పోలేదు. మా పెద్దలు వేసిపోయిన తోటలే మా మనుమలదాకా అనుభవానికి వస్తాయి. శ్రద్ధ లేకపోయాక వృధా ఖర్చు కాదూ?" ప్రభాకర్ సాగుకు తీసుకోబోయే పొలం చూపిస్తూ చెబుతున్నాడు రామారావు.

"ఆఁ. అదినిజమే. భూమిలో చెట్టు పెట్టగానే సరికాదు. అది పెరిగి ఫలితానికి వచ్చేప్పటికి ఎంతో ఖర్చు, శ్రమా. అయినా, ఫలితం అనుభవించేదాకా ఓపికా, ఆశా వుంటే ముందు శ్రమకు ఎంతైనా ఓరుస్తాం."

"నువ్వేదో తోటలూ అవీ అంటున్నావు చాలాఖర్చుతో కూడినవని. మీ బావి దగ్గర తోటకు అనువుగానే ఉంటుందనుకో. కాని, తోటవేసినంత సులభంకాదు. పసిపిల్లలకు లాగనే వాటికి కావలసినంత లాలన పోషణా అవసరముంటుంది."

"అదే ప్రయత్నించి చూదామని వుంది."

"చూడు చూడు. నీ ప్రయత్నం విజయవంతమైతే అది గ్రామస్తులందరికీ ప్రయోజనకర మవుతుంది. కాకపోతే, చెప్పుకోడానికి కనీసం నీ అనుభవమైనా పనికి వస్తుంది!"

పొలంగట్టుమీద వేణు కనిపించి అతడి దగ్గర ఆగిపోయాడు ప్రభాకర్.

"బొత్తిగా కలవడం మానేశావు." విష్ఠురమాడాడు వేణు. "కరణంగారివెంట చాలా కనిపిస్తున్నావు. ఏమిటి సంగతి?"

"కాస్త నాతో ఆ ఒడ్డెగుడిసెలదాకా నడూ చెబుతాగాని." వేణు భుజం పట్టి ఈడ్చుకుపోతూ అన్నాడు ప్రభాకర్.

"అక్కడేంపని?"

"ద్రాక్షతోట పెట్టిస్తున్నానురా. రాతి స్తంభాలకు ఆర్డరు యిచ్చిరావాలి."

'ద్రాక్షతోట!!' ఈ మొగమేనా ద్రాక్ష తోట పెట్టేది-అన్నట్టు చూచాడు వేణు.

"ఒక ద్రాక్షతోటేకాదు. కూరగాయల తోట, అరటితోట-అన్నీ తోటలే పెట్టిస్తాను. అదృష్టం కలసివస్తే ఆకాశాన్ని అందుకొంటాను. లేకపోతే అధః పాతాళానికి పోతాను. అప్పుడు ముష్టెత్తుకొన్నా సబబుగానే వుంటుంది."

వింతగా చూచాడు వేణు. "నీకున్న పొలమెంత? నువ్వుపెట్టే తోట లెన్ని?"

"అందుకే కరణంగారి పొలం సాగుకు తీసుకొంటున్నాను. వరి, మామూలు కాయధాన్యం వాటిలో పండించి, మా బావి దగ్గర తోటలకు ప్లాన్ వేస్తున్నాను."

"అయితే నీ ఉద్యోగానికి పూర్తిగా ఆశ వదులు కొన్నట్టేనా?"

"ఆఁ! ముష్టిఉద్యోగం పోతేపోయింది." ఏదో కసి, నిర్లక్ష్యం మేళవించి అన్నాడు ప్రభాకర్. "ఉద్యోగమే బంధనం ఆ బంధనంలో మనిషి జీవితం గిటకబారి పోతుంది. ఆ బంధంనుండి బయటపడడం, అదృష్టమనే అనుకొంటున్నాను. స్వేచ్ఛగా మనకు తోచిన దారినపోవచ్చు."

"అయితే కాడిని తోలుతానంటావు-ఈ మహా ఘనకార్యానికి బి. యి. చదువు వెలగబెట్టవలసి వచ్చిందా?"

"చదివింది దీనికోసం ఎంత మాత్రం కాకపోయినా అవసరాన్నిబట్టి ఆ తెలివి ఇందులో ఉపయోగిస్తాను."

"మంచిదే! ఈ వ్యవసాయంలో కలిసి వస్తేవస్తుంది; లేకపోతే పెట్టుబడికే మోసం వస్తుంది. ఇంకా నువ్వేదో తోటలంటున్నావు చాలా సాహసమే సుమా."

"ఒరే! అయిదేళ్ళనుండీ వ్యవసాయంలో నలుగుతున్నవాడివి నువ్వే నన్నిలా నిరుత్సాహపరిచి వెనుకడుగు వేయిస్తావా? ముందు ముందు నీ ప్రోత్సాహం, సహకారం ఎంతో లభ్యమౌతాయని ఉబలాటపడి పోతున్నాను."

"ఆఁ అయిదేళ్ళ అనుభవం ఉండబట్టే చెప్పడం. ఇంతపెట్టుబడీ ఎవడిదగ్గరో తెచ్చి చేయవలసిందేనా? ఖర్మంకాలి పెట్టుబడి కూడా గిట్టుబాటుకాకపోతే ఆ ఇచ్చినవాడు విన్నూ వేలం వేయించగలడు."

"అదేం జరుగదు. అదృష్టం కలసివచ్చే సూచనలు వున్నాయిరా నాకు. కాకపోతే నా కీ బుద్ధే పుట్టదు."

ఒడ్డెగుడిసెలదగ్గిర వ్యవహారం ముగించుకొని ఊళ్ళోకి వచ్చారు మిత్రులిద్దరూ.

"ఇక వస్తానురా."

"ఇంట్లోకి రావోయ్! కాస్సేపు కూర్చుని వెడుదువుగాని." రెక్కపుచ్చుకు లాక్కుపోయాడు ప్రభాకర్‌ను, వేణు.

వేణు తల్లి యివతలికి వచ్చి అంది: "బొత్తిగా ఇటు రావడమే మానేశావేం, ప్రభాకరం? అంత తీరిక లేకుండా వుందా?"

"రోజంతా తీరికకాక నా కుండే పనులేమిటి-అత్తా?"

"లోపలికిరా, ఫలహారం చేద్దువు."

వరండాలోనించి హాల్లోకి అడుగుపెట్టిన ప్రభాకర్ అక్కడ ఓ మూలకు కనిపించిన దృశ్యాన్ని అమాయకంగా, ఆశ్చర్యంగా చూస్తూ ఆగిపోయాడు.

పీటమీద కూర్చున్న ప్రమీల అన్నగారితో వచ్చిన ఇతడిని చూచి సిగ్గుతో ముఖం ప్రక్కకు తిప్పుకొని మూలకు ఇంకా ఇంకా ఒదిగిపోతున్నది. ఆమె కూర్చున్న గోడకు మీదుగా వసంతంలో అద్దిన హస్త ముద్రలు కనిపిస్తున్నాయి. దగ్గరగా గోడకు ఆనించిన బొమ్మా, అద్దమూ-ఇంకా కొన్ని వస్తువులు వున్నాయి.

"ప్రమీల పెద్దమనిషయింది." చెప్పింది వేణుతల్లి. "పిల్లకు ఏళ్ళు తక్కువలేకపోయినా పొడవుగా, సన్నగా ఎదిగిపోయి అన్ని ఏళ్ళు కనిపించేవికాదు. అది మూలకు కూర్చోగానే పెళ్ళికి తొందరపట్టుకొంది నాకు."

లోపలి గదిలోకి తీసుకుపోయి ఫలహారం పెట్టింది. ఫలహారంతోపాటు విన్న పేరంటానికి చేసిన నువ్వుల చిమ్మిలికూడా పెట్టింది. ఎందుకో అవి ముట్టుకోవాలంటే సిగ్గేసింది ప్రభాకర్‌కు-తినకుండానే బయట పడ్డాడు.

ప్రభాకర్ ఇంటికి వచ్చేప్పటికి సంధ్య చీకట్లు అలుముకొంటున్నాయి.

రాత్రికి అంతా వాకిటిలోనే పడుకొంటారు కాబట్టి నేల చల్లబడడానికి నీళ్ళు చల్లుతూంది సుగుణ. పగలంతా బాగా కాలిన నేల నీళ్ళు తగలగానే కావునూ, కమ్మని వాసననూ వెలిగ్రక్కుతూంది.

ఇంట్లోకి వెళ్ళకుండా వాకిట్లోనేవున్న మంచం వాల్చుకు పడుకొన్నాడు ప్రభాకర్. సుగుణ వరండాచివరికి వచ్చి నిలబడడం చూచి "ఇలారా, సుగుణా!" అని పిలిచాడు.

"ఏమిటి అన్నయ్యా? మంచినీళ్లు కావాలా?"

"ఉహుం.– ఇలా వచ్చికూర్చో."

మును పెన్నడూ అలా పిలిచి కూర్చో పెట్టుకోని అన్నగారిని ఆశ్చర్యంగా సమీక్షించింది సుగుణ.

"కూర్చో."

మంచం పట్టెమీద కూర్చొంది.

"నీ కెలాంటి మొగడుకావాలే, చెల్లాయ్?"

"ఛీ పో, అన్నయ్యా!"

తుర్రున వెళ్ళబోయిన ఆమెను చివుక్కున పట్టుకొన్నాడు. "నీ కెలాంటి మొగుడు నచ్చుతాడో తెలిస్తేకదా, అలాంటి వాడికోసం నేను గాలించి ఏ మూల ఉన్నా పట్టుకొచ్చి నీకు కట్టబెట్టేది! బాగా చదువుకొని గొప్ప ఉద్యోగం చేసేవాడు కావాలా? మామూలుగా చదువుకొని–అంటే–స్కూల్ ఫైనల్‌దాకా చదువుకొని, సంసారం ఒదుపుగా నడుపుకోగలిగి, నిన్ను అపురూపంగా చూచుకొనేవాడు కావాలా? చెప్పాలి... ఎర్రటివాడే అవాలా? చామనఛాయ ఉండి కళగల ముఖమైతే చాలా?...ఇంత సిగ్గు అవుతే నీకు నేను మొగుణ్ణి తీసుకురానుపో. చెప్పాలమ్మా. సిగ్గు కాస్సేపు ప్రక్కకు పెట్టి."

ప్రభాకర్ కొంచెం చేయి సడలిస్తే ఎప్పుడో పారిపోయేది ఆ పిల్ల.

ఇంతకుముందే వరండాలోకి వచ్చిన రామలక్ష్మమ్మ, "సిగ్గుపడకుండా ఎలా ఉంటుందిరా ఆడపిల్ల–నీది మరీ చోద్యం కాకపోతే? నా కిలాంటి మొగుణ్ణి తెమ్మని చెబుతుందా? ఆడపిల్ల లందరికీ వున్నట్టే దానికీ వుంటుంది, "అందమైనవాడూ, చదువుకున్నవాడూ, పెద్ద ఉద్యోగం చేస్తున్నవాడూ."

"నువ్వాగమ్మా, మా చెల్లి చెబుతుంది కాని."

"నాకు తెలీదుపో."

సూర్యనారాయణ బయటినుండి వస్తూ వీరిని చూసి "ఏం కథ?" అన్నాడు.



"దాని కెల్లాంటి మొగుడుకావాలో అడుగుతున్నాడు," అన్నది రామలక్ష్మమ్మ.

"ఊఁ చెల్లెలుకోరితే కలెక్టర్‌నే తెస్తావోయ్! రోజంతా వీధుల్లో బలాదూర్ తిరుగుతూ నువ్వు చేస్తున్నపని అదేనేమో?" అన్నాడు సూర్యనారాయణ హేళనగా.

కొడుకు ఏఏ పనులగురించి అలా ఊళ్లో తిరుగుతున్నాడో ఆయనకు తెలియదు. తన ఆలోచన లేవీ ఆయనతో చెప్పడం లేదు ప్రభాకర్. అందుకు కారణం–తన ప్రయత్నాలకూ, ఆలోచనలకూ ఆయన అంత ప్రోత్సాహమివ్వడని అతడి అనుమానం. పైగా ఎందుకూ సాగనివ్వడుకూడా!

ఉద్యోగంపోయి ఇంటికి వచ్చినప్పటి నుండి ప్రతి విషయంలోనూ తండ్రివైఖరి ఇలాగే ఉంటూంది!

ప్రభాకర్‌కు రోషం వస్తుంది కాని, ఏమనడానికీ పరిస్థితులు అనుకూలంగా లేవు. ఇప్పటికిప్పుడు తన ప్రజ్ఞ చూపుకోడానికి చేతిలో ఏమీలేదు. అదృష్టదేవత కరుణించి, కాలక్రమంగా తప్ప ఇప్పుడు తనేం మాట్లాడినా ఉత్తరప్రజ్ఞలుగానే కనపడతాయి. అందుకే తండ్రి వెటకారానికి సమాధానమేమీ లేకుండా లోపలికి వెళ్ళిపోయాడు.

* * *

ఆ రోజు మధ్యాహ్నం సూర్యనారాయణ రుసరుసలాడిపోతూ ఇంట్లోకి అడుగు పెట్టాడు. అప్పుడే భోజనం ముగించి, ఏదో పుస్తకం తీసుకొని కాస్త నడుం వాల్చబోతున్నాడు ప్రభాకర్.

"ఆ కాస్త తిండికి గింజలు లేకుండా చేద్దామనేనా నువ్వు చేస్తూన్న నిర్వాహకం? ఉద్యోగంపోయి ఇంట్లో వచ్చి ఊరికే పడివుండక ఏమిటిరా నువ్వు చేస్తున్నది?"

"ఏమిటి?" కనుబొమలు చిరాగ్గా ముడిచాడు ప్రభాకర్.

"మామూలుగా బావిదగ్గిర వరివేయడానికి నేను నారుపోయిస్తే నువ్వేదో తోటలవీ వేయిస్తా నన్నావటా?"

"అవును," నెమ్మదిగా అన్నాడు.

"నారు పోయిస్తే ఏమైంది? కరణం పొలం

సాగుకు తీసుకొంటున్నానుగా? అక్కడ వేయించొచ్చు.''

"కరణం పొలం సాగుకు తీసుకొంటున్నావా?" వింతగా అడిగాడు. "ఉద్యోగం నుండి తీసేస్తూ వాళ్లు నీకు మూటగాని అందించారేమిటి?"

''పెట్టుబడికూడా రామారావుగారే పెడతా నన్నారు.''

ఇదివరకు ఆయనదగ్గర చేసిన అప్పు చెల్లించే మార్గం కనిపించక ముఖం తప్పించుకు తిరుగుతున్న సూర్యనారాయణ కొడుకు చెప్పింది విని ఎంతైనా నివ్వెరపడ్డాడు.

ఆ తరువాతకూడా ప్రభాకర్ వేయబోయే తోటలమీద చాలా వాగ్వివాదమే జరిగింది. కొడుకు పథకాలేవీ ఆయనకు ఆశాజనకంగా కనిపించలేదు. చివరికి నిష్కర్షగా చెప్పి కదిలాడు. "ఆ వెధవ ప్లానులు మరెక్కడైనా వెలగబెట్టుకోగాని నా పొలంలోకి మాత్రం అడుగుపెట్టకు.''

అశాంతితో, చీకాకుతో కొట్టుకులాడిపోయాడు ప్రభాకర్. ఎన్నెన్నో అనుకొన్నాడు. ఇక ఏం చెయ్యాలి?

అడుగడుగునా తండ్రిచూపే విరసనా విర్లక్ష్యాలకూ, తన ఉద్దేశ్యాలేవీ నిదానంగా అర్థంచేసుకోలేక ఆయన చేసే ప్రతిఘటనలకూ మనసు విరిగిపోతూంది. గుడ్డ నెత్తినేసుకొని వీళ్ళకు ముఖం చూపించకుండా ఎక్కడికైనా పారిపోతే బాగుండేదన్న ఆవేశం రేగుతూంది. నిరుద్యోగ సమస్య ఒకటి సైతానులా నెత్తిన కూర్చొన్నప్పుడు ఎక్కడికి వెళ్ళి ఏం చేయగలడు?

సంఘర్షణలో కొట్టుకొని చివరి నిశ్చయానికి వచ్చాడు 'నాన్న నా బుర్ర బద్దలు కొట్టినా సరే–ఇంటిదగ్గర వుండే నా ప్రయత్నాలు సాగిస్తాను!'

* * *

నాగడు భూమిలోకి గుచ్చిన గునపం అలాగే ఉంచేసి కంగారుగా అన్నాడు: "మీ అయ్య వస్తున్నారయ్యా!''

"రానీ!" అల్లంతదూరంలో గబగబా అంగలువేస్తూ వస్తూన్న తండ్రినిచూచి నిర్వికారంగా అన్నాడు ప్రభాకర్.

"నా మాటను ఇంతగా ధిక్కరించగలవని ఈనాడే తెలుస్తూంది," తీవ్రంగా అన్నాడు సూర్యనారాయణ సమీపించి. "దేని కింత మూర్ఖం? నా పొలంలోకి అడుగుపెట్టకని చెప్పానా? నా మాట లక్ష్యం లేకుండా 'నేను చేసేది చూడు' అన్నట్టు, కూలివాళ్ళనుపెట్టి పొలంలో గోతులు పెడుతున్నావా?''

చాలా నిర్లిప్తంగానే నిలబడ్డాడు ప్రభాకర్.

ఇంకా మండిపడ్డాడు ఆయన. "ఆ గునపాలు పారలు తీసుకొని తక్షణం ఇక్కడి నుండి కదలండి, లేకపోతే, ఈ గోతుల్లో మిమ్మల్ని పూడ్చిపెడతాను."

''ఆ పని చెయ్యి నాన్నా. సమస్యే పరిష్కారమైపోతుంది ఇక.'' చురుగ్గా నవ్వాడు. "మీ మాట కాదనక చేసేదేముంది? ఉద్యోగార్హత కలిగినా ప్రభుత్వం ఉద్యోగం చూపలేకపోతూంది. ఏదో ఇంత పొలం వున్నదికదా, సేద్యం చేసుకొని బ్రతుకుదామంటే నా పొలంలోకి అడుగుపెట్టకంటున్నావు నువ్వు! అయితే, యిక ఏం చేసి బ్రతకాలంటావు? దేశంమీదపడి ముష్టెత్తుకోనా? ఉన్నవాళ్ళ కొంపలు దోచనా?"

కొద్దిసేపుదాకా, సూర్యనారాయణ నోట మాట రాలేదు. కొడుకు మాట న్యాయంగా తోచి, మరి వాదించడానికి నోరు వచ్చింది కాదు.

చేతికర్రతో చుట్టూ కొంతమేర ఒడ్డు గుర్తులు చూపెడుతూ "ఈ లోపల ఏమైనా తగలడు, అవతల సెంటుభూమికూడా ఉపయోగించుకోడానికి వీల్లేదు.''

'మహాప్రసాదం!' గిర్రున వెనుదిరిగి వెళ్ళిపోతున్న తండ్రినిచూచి పరిహాసంగా అనుకొన్నాడు ప్రభాకర్.

ప్రభాత సమయంలో నీలాకాశం నిర్మలత్వాన్ని ప్రతిఫలిస్తున్నది. క్రితం రాత్రి కురిసిన వర్షంలో తడిసిన ప్రకృతి అభ్యంగన మంగళాంగి సౌకుమార్యాలను సంతరించుకొని అపూర్వాకర్షణను కలిగిస్తున్నది.

టీ సేవించి, దారిలో వేణును కలుపుకొని వస్తూ, కాలువ ఒడ్డుమీద నిలబడి తను వేసిన తోటను చూచుకొంటున్న ప్రభాకర్ నేత్రాలలో అతిప్రయాసతో తను ప్రసవించిన బిడ్డను చూచుకొనే మాతృ మమకార వాత్సల్యాలే కదలాడుతున్నాయి.

వాళ్ళకు ముందు వరసలో వున్న నిమ్మమొక్కలు పాత ఆకులురాలి, కొమ్మలు మొద్దుల్లా అయి, అప్పుడప్పుడే చిగురులు పెట్టుకువస్తున్నాయి. ఇంకా వారం పది రోజుల్లో చెట్లన్నీ పచ్చపచ్చగా పల్లవిస్తాయి.

ప్రభాకర్ అనుకొన్నవన్నీ సక్రమంగానే జరుగుతూనే వున్నాయి. ఇంతవరకూ తోటలో తను నాటదలచుకొన్న మొక్కలన్నీ నాటాడు. తోటను శ్రద్ధగా చూడడానికీ, ఉదయ సాయంకాలాలు నీళ్లు కట్టడానికీ ఓ కుర్రాడికి జీతమిచ్చి ఉంచాడు.

మిత్రుడి ముఖంలోని ఉత్సాహాన్ని గమనిస్తూ వేణు అన్నాడు: "ఇల్లు అలకగానే పండగ కాలేదు; ముందరున్నాయి నీ పాట్లన్నీ."

''పాట్లేమిటి?''

"ఇప్పుడు తెలియవు – పది రోజులు గడవనీ–నీకే తెలుస్తుంది ఎన్ని చిక్కులో."

''కానీ రోట్లో తలదూర్చి రోకటిపోటుకు వెరిస్తే ఎలా?"

ప్రభాకర్‌ను నిరుత్సాహ పరిచాదేగాని, వేణు అంతరంగంలో మటుకు కొత్త ఆలోచన మొలకెత్తుతున్నది. వీళ్ళ పొలం ప్రక్కనేవున్నది వేణు పొలం, తోటపెడితే చాలా అనువుగాకూడా వుంటుంది. ద్రాక్ష పందిళ్లు పెట్టించాలంటే చాలా పెట్టుబడి కావాలిగాని నిమ్మ, బత్తాయిలాంటివి పెడితే వచ్చినా, పోయినా రెండు మూడు వందలతో పోతుంది.

చాలా చిన్నవయసులోనే అతడు వ్యవసాయంలోకి దిగవలసి వచ్చింది. వేణు స్కూల్ ఫైనల్లో ఉన్నప్పుడే తండ్రి కాలం చేశాడు. గోపాలంగారు అతనికి స్వయానా పినతండ్రే. అతనికి కాని, రెండు కుటుంబాల మధ్యద్వేషాలవల్ల. రాకపోకలు ఎప్పుడో తెగిపోయాయి.

వేణు, మరోమార్గం లేక తప్పనిసరిగా చదువుకు స్వస్తిచెప్పి సేద్యంలో పడవలసి వచ్చింది.

అప్పటికే అయిదారేళ్ళ అనుభవమున్న వేణుకు ఎప్పుడూ తోటలు ఉద్దేశ్యం కలుగలేదు. మామూలుగా బావులదగ్గర, నీటివసతి ఉన్నచోట కాయగూరలైతే రైతులు చాలావరకు పెడతారు. కొన్నేళ్ళ తరువాత ఫలసాయం అనుభవానికి వచ్చే తోటలు పెట్టడమే అరుదు.

వేణు యిన్నాళ్ళుగా వ్యవసాయం చేస్తున్నా ఏవో కాయధాన్యాలూ, వరీ తప్ప మరొకటి పండించి ఎరగడు. ఎవరెన్ని విధాలుగా నిరుత్సాహ పరిచినా ప్రభాకర్ తోటపెంచి చూపుతున్నాడు. ఇప్పుడు అతడు వేసినతోట చాలా చిన్నదే అయినా పురుగూ పుచ్చూ పట్టకుండా ఆరోగ్యంగా పెరగాలేగానీ, రెండుమూడేళ్ళ తరువాత ఎవరికి గుత్తకు యిచ్చినా ఎంత లేదన్నా, ఏటా అయిదారువేలకు డోఖా ఉండదు.

* * *


"ఎవడి తిక్క వాడికీ ఆనందం. ఇదుగో పొడిచేస్తాను చూడమని - వెయ్యిపన్నెండు వందలు తగలేశావు. వెళ్ళి చూచుకోపో - నీ తోటను!"

"ఏమైంది?" గతుక్కుమన్నాడు-తండ్రి హేళనే కాని. సంగతి అర్థంకాని ప్రభాకర్,

"పశువులు కమ్మగా మేసిపోయాయి."

"నాగ డేమయ్యాడు?"

"ఎవడికి తెలుసు! నేను వెళ్ళేప్పటికి ఏ నాగడూ అక్కడ లేడుగానీ పశువులు మేసిపోతున్నాయి. చూచి నేను తోలాను."




మనస్సంతా ఏమిటో అయింది ప్రభాకర్కు. అప్పటి కప్పుడు పొలానికి వెళ్ళాడు. పశువులు తోటంతా మేసిపోలేదుగానీ అయిదారు చెట్లు మొద్దుల్లా తయారయ్యాయి. రేయింబవళ్లు కాపలా వుండవలసిన నాగడి జాడే లే దింతవరకు. చిరాకూ, కోపం పెనవేసుకుపోగా అనుకొన్నాడు - 'మంటికైనా ఇంటివాడు పోవాలని పెద్దలు ఊరికే చెప్పలేదేమో! నౌకర్లను నమ్ముకొని ఇంటిలో నిశ్చింతగా వుండేకాలం కాదు. డబ్బు తింటారు. మోసంచేస్తారు. ఛీ!'

ప్రభాకర్ అక్కడ వుండగానే నాగడు వచ్చాడు.

వెర్రికోపంతో చిందులు తొక్కాడు ప్రభాకర్. "ఎక్కడ చచ్చావురా? తోటంతా నాశనమైపోతూ ఉంటే?"

నాగడు ఏదో నసిగాడు. "ఈ తప్పు కాయండి, దొరా, ఇప్పుడే ఎల్లాను ఇంటికి. అటు ఈపు మళ్లగానే ఇటువొచ్చి పడినట్టున్నాయి గొడ్లు."

వాడు వెళ్ళి ఎంత సేపైందో ప్రభాకర్ చెప్పలేదు. కాని, వారంరోజుల లోపలే అక్కడ గుడిసె ఒకటి పడింది, ప్రభాకర్ ఉండడానికి. తోటపూర్తిగా నౌకర్లమీద వదిలి ఉండడానికి అతడికి ధైర్యం చాల్లేదు. దాని సంరక్షణాభారం పూర్తిగా తనమీద వేసుకోక తప్పింది కాదు. తనజీవితాశలన్నీ ఈ తోటమీదే ఆధారపడి వుండడం కాక, ఊళ్ళోవాళ్ళ అపహాస్యాలన్నీ పక్కకుపెట్టి, తగుదునమ్మా అని తోటపెట్టి, ఇక తోట పాడుపెడితే ఊరివాళ్ళముందు నవ్వుల పాలుకాక తప్పుతుందా?

బావిగట్టున వేణుకూడా గుడిసె వేయించుకొన్నాడు. అతడూ చిన్నపాటి తోటపెట్టాడు ఇప్పుడు కొద్దిమొక్కలతో ప్రారంభించిన తోట, ఏటా మరికొన్ని మొక్కలు వేస్తూపోయి పెద్ద తోటనే రూపొందించాలని అతడి ఊహ.

* * *

గాలిపాటుకోసం చూస్తున్నాడు వడ్లు తూర్పారబడుతున్న ప్రభాకర్.

గాలి రావడమే తడవుగా, ఎక్కడా తడబాటు లేకుండా అనుభవమున్న ఆడపిల్లకంటే చురుకుగా వడ్లు తూర్పారబడుతూన్న ప్రభాకర్ను నిద్దూరంగా చూస్తున్నది మంగి- "బాబూ, మీరు సదివిన సదువుల్లో ఇయి కూడా నేర్పినా రేంటి?"

బంతికి వచ్చిన కూలీ లందరికీ ముచ్చటగా వుంది, ఎక్కడో ఆఫీసరు ఉద్యోగములో ఉండాల్సిన అబ్బాయి అతి నిరాడంబరమైన రైతుబిడ్డలా తూర్పారబడుతూన్న అతడిని చూస్తూంటే.

ధాన్యం రాసిపడింది. బళ్ళకట్టించుకొని కరణం వచ్చాడు. అంత ఎత్తుగాపడిన రాసి చూచి ఆయనకళ్లు ఆశ్చర్యానందాలతో రెపరెపలాడాయి. చేనుమీద వేసిన అంచనాకంటే

రెండుగింజలు ఎక్కువే కొలతకు వచ్చేట్టున్నాయి. అదే పొలంలో ఆ మాత్రం పంట కళ్ళబడడం అదే మొదటిసారి.

"ఫర్వా లేదోయ్! వ్యవసాయం నీకు బాగానే అచ్చివస్తుంది. ఊరికేనే అన్నారా పెద్దలు 'కృషితో నాస్తి దుర్భిక్షం' అని! ఈ పంట ఇదివరకు నా కళ్ళతో చూడలేదంటే నమ్ము. ఖర్చులుపోను రెండుబస్తాలు మిగిలితే మహా ఎక్కువ!"

ఎంతో తృప్తిగా చూచుకొన్నాడు రాసి వంక, ప్రభాకర్. "కొలిచి, అంతా బళ్ళకు ఎత్తించుతావా? నా పాలు నా కిచ్చి తరువాత నా డబ్బు చెల్లగట్టుతా నంటావా?" అన్నాడు రావు.

"అహఁ. తిండికి కావలసిన గింజలు తీసుకొని మిగతావి బాకీక్రిందికి చెల్లగట్టుకోండి. ఉంచుకొనే కొద్దీ అప్పు భారమే కదా?"

"అలాగే కానీ," ప్రభాకర్ భుజంతట్టి అన్నాడు రామారావు. "మళ్ళీ పంటకి నా బాకీ, పెట్టుబడీ పూర్తిగా తీర్చివేస్తావులే!"

"అలాగే కానివ్వండి. మీలాంటి పెద్దల ఆశీర్వాదంతో, ఆదరంతో నే నొకమనిషిని కాగలుగుతున్నాను. మాటలతో తప్ప మరొకవిధంగా మీకు కృతజ్ఞతలు చెప్పుకోలేను!"

ప్రభాకర్‌మీద రావుగారికి ఒకమంచి అభిప్రాయం ఏర్పడిపోయింది. వ్యవసాయములో అతడికున్న శ్రద్ధాసక్తులు ముచ్చట గొలుపుతున్నాయి ఆయనకు. మరికొంత పొలంకూడా ప్రభాకర్‌క్రింద సాగుకివ్వుంచితే బాగుంటుందన్న ఆలోచనకూడా ఆయనలో తలెత్తుతున్నది. 'అతడూ బాగుపడిపోతాడు, వంచనలేకుండా నాకూ లాభాలు చూపగలడు!' అనుకొన్నాడు. కాని, ఆయనకు ఇద్దరుకొడుకులు వున్నారు. పెద్దవాడు డాక్టరీ చివరి సంవత్సరంలోనూ, చిన్నవాడు బి. ఏ. లోనూ, వున్నారు. ఇలా ఒక్కొక్కటే పొలం పందిచేతుల్లోకి పెడితే వారి అభ్యంతర మేమైనా వుండవచ్చు. వారితోకూడా సంప్రదించి ప్రభాకర్‌కు మరికొన్ని పొలాలు సాగుకు యివ్వా లనుకొన్నాడు. ఎందుకంటే ఆయనకు అనువుగాని పొలాలు చాలావున్నాయి. అన్ని పొలాలూ ఒకేచోట లేవు. చుట్టుప్రక్కల నాలుగైదు గ్రామాలలోకూడా వున్నాయి. ఊరిపొలాలు ఎలాగైనా చూచుకోవచ్చుగాని ప్రక్కఊళ్ళలో ఉండేవి చూచుకోడానికి ఎంతో యిబ్బందిగా ఉంటూంది ఆయనకు. అలా చూచుకోకపోవడంవల్లే అక్కడి పంటలు అంతంతే వుంటున్నాయి.

ప్రథమప్రయత్నంలోనే ఈ పంటా యిదీ చూచాక ప్రభాకర్‌లోకూడా మరి కొన్ని పొలాలు సాగుకు తీసుకొందామన్న ఆలోచన కలిగింది. కాని, రావుగారిని అడగడానికి కొద్దిగా సంకోచం అడ్డుతగిలింది. ఆయన అంగీకరించలేకపోతే ఊళ్ళో మరెవరిదగ్గరైనా ప్రయత్నించాలన్న ఊహ కలిగింది. మరునాడు రావుగారి ఇంటికి వెళ్ళినప్పుడు తన ఆలోచనను వ్యక్తపరిచాడు ప్రభాకర్.

"నాకు అభ్యంతరమేమీ లేదుగాని మా పెద్దవాడిని ఒకమాట అడగాలి; ఎందుకంటే — మా పిల్లలూ పెద్దవాళ్ళు అవుతున్నారు కదా? వాళ్ళ చదువులవీ అయ్యాయంటే ఉద్యోగాలకు వెడతారో, ఇంటి దగ్గరవుండి ఈ పంటలవీ చూచుకొంటామంటారో? ఈ వారం పదిరోజుల్లో పెద్దవాడు వస్తున్నాడు; అతడొచ్చాక చూద్దాం," అన్నాడు రామారావు.

వారం రోజుల్లోనే వచ్చాడు—రావుగారి పెద్దకొడుకు రామమనోహరరావు. అతడి సమక్షంలోనే తండ్రిని తిరిగి కదిలించాడు ప్రభాకర్.

"ఏమంటావురా?" అన్నాడు రామారావు, కొడుకు నుద్దేశించి.

"మీకు హంగుకానివి వుంటే అలాగే కానివ్వండి. ఈ చదువు అయిపోయాక నేను ఇంటిదగ్గరే ఉండాలనుకొంటున్నాను; గాని నా వైద్యానికీ, వ్యవసాయానికీ పొత్తు ఎలా కుదురుతుంది? కాని, పొలం ఏ క్షణంలో వదిలిపెట్టమంటే ఆ క్షణంలో వదిలేసే షరతుమీద సాగుబడికి యివ్వండి పొలం,'' అన్నా డతడు.

* * *

"ఏం చేస్తున్నావు, సుగుణా? బొత్తిగా మా యింటికిరావడమే మానేశావేం?''

ఎదురింటివరండాలో నిలబడి అడుగుతూన్న స్నేహితురాలికి జవాబుగా అంది సుగుణ: "బొత్తిగా తీరడంలేదు. పార్వతీ. మా అమ్మ తోటకువెళ్ళిందంటే పనంతా నా మీదే పడుతూంది.''

"ఒక ఆట వామనగుంటలు ఆడి పోదువురా—అంతలో అంత కొంపమునిగే పనులేమున్నాయి.''

"ఉహుఁ—తను వచ్చేప్పటికి ఇల్లు చిమ్మి కుంపటిమీద అన్నానికి పెట్టకపోతే మరి ఊరుకోదు మా అమ్మ!" మనసు ఆటమీద పీకుతున్నా, అమ్మ వచ్చేప్పటికి పనులన్నీ చక్కబెట్టకపోతే పడబోయే అక్షతలు గుర్తువచ్చి ఇంట్లోకి నడవక తప్పిందికాదు సుగుణకు. ఇదివరకు ఒక్కపనికూడా ముట్టేదికాదు ఆ పిల్ల, ఎప్పుడూ ఎదిరింట్లో పార్వతితో ఆటలూ, కబుర్లూ! అంత తీరుబాటు తప్పిపోయి ఈ మధ్య చాలా రోజులే అవుతున్నది.

ఈ ఏడు కూరగాయలతోట బావిదగ్గర పెద్దగా పెట్టించాడు ప్రభాకర్. ప్రక్కఊళ్ళలో పొలాలు చూచుకొని అటు యిటు తిరగడంతో తోటను ఎప్పుడూ కనిపెట్టుకువుండడం కుదరడం లేదు అతడికి. కాసిన కూరా, కాయా ఏరి అమ్మించడానికీ చెయ్యడానికీ ఇంటిమనిషి దగ్గరుండడం ఎంతైనా అవసరం. ఆ పని తల్లికి అప్పగించాడు ప్రభాకర్. కాయా కూరా ఏరి గంపకెత్తి కూలిమనిషితో అమ్మకానికి పంపి వచ్చే రెండుమూడు రూపాయలు తల్లినే తీసుకొమ్మని చెప్పాడు అతడు.

ఇదివరకు ఎప్పుడూ గడపదాటి ఎరుగదు రామలక్ష్మమ్మ. ఊరి అంచున తమకు

బావి వుందని తెలుసేగాని ఏనాడూ ఆ పొలంలో కాలుపెట్టి ఎరుగదు. అస్తమానం గృహకృత్యాలలో మునిగితేలడం తప్పితే బయటికివెళ్ళే తీరికా, అవసరం కనిపించేది కాదు. భర్త తెచ్చినదేదో వండిపెట్టడం, ఇల్లు పొందికగా ఉంచుకోవడం అంతేగాని మరో చింతే ఉండేదికాదు.

కొడుకు పెత్తనం వచ్చాక ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎవరికీ క్షణం తీరిక ఉండడంలేదు ఇంట్లో.

చాలావరకు తోటదగ్గరా, అక్కడే ఉంటున్నాడు సూర్యనారాయణ. ముందు ఏమో అనుకొన్నాడు గాని, కొడుకు పండిస్తున్న పంటలు చూస్తుంటే కడుపు నిండిపోతున్నది ఆయనకు. తను వ్యవసాయం చేసినన్నాళ్లూ తిండిగింజలు తెచ్చుకొంటే చాలునన్న తాపత్రయం తప్ప మరో విధంగా పైకి వచ్చే ఆలోచనే చేయలేదు. అన్నానికి కటకటపడలేదు గాని, కమ్మగా తిన్నామన్న రోజు ఆయన జీవితంలో రాలేదు. అన్ని అవసరాలు, సరదాలు తీర్చుకొనే రాబడి ఏనాడూ లేదు.

ఈనాడు అట్లాకాదు; ఏడాదికి సరిపడే ధాన్యం వుంది ఇంట్లో. చేతి ఖర్చులకు తోటమీది నాలుగూ అయిదూ వస్తున్నాయి రోజూ.


మరో ఏడాది రెండేళ్ళలో ద్రాక్ష, నిమ్మ, బత్తాయిల ఫలసాయంకూడా కలసివస్తుంది. ఇప్పటినుండే గుత్తకు అడిగిపోతున్నారు.

కుటుంబంలో ఏనాటినుంచో పాతుకున్న నిద్రాణస్థితి, జడత్వం తొలగిపోయి ఏదో హుందాతనం, కొత్త కాంతి, చురుకూవచ్చి పడ్డాయి.

*　　*　　*

కరణంగారిచిన్నకొడుకు కృష్ణమోహన్ సాయంత్రం షికారుగా ప్రభాకర్ తోట దిక్కుగా వచ్చాడు.

ద్రాక్షతోటలో వున్నాడు ప్రభాకర్, తీగలు సరిజేస్తూ.




తోట ఎటుచూచినా ఆరోగ్యంగా, పుష్టిగా అగుపడుతున్నది. పచ్చని తోటలో ఏరుకు తింటూన్న తెల్లని కోళ్ళనుచూచి, "కోళ్ళ పరిశ్రమకూడా పెట్టారా?" అని అడిగాడు కృష్ణ.

"అవును."

"పాదులుతవ్వి పాడుచేయవూ?"

"పాదులచుట్టూ గుమ్మటాలు లేవూ?"

"బాతులుకూడా పెంచవలసిన మాట."

"దానికి నీటిగుంటల వసతి కావాలి. చింతచెట్టు దగ్గర బొంద వున్నదిగాని, దాంట్లో చేపలు విడిపించాను. బాతులు పెట్టానా - రోజూ కొన్ని చేపలు గుటకాయ స్వాహా అయిపోతాయి.

"కోళ్ళ పరిశ్రమా, మత్స్యపరిశ్రమా - ఓ! ఇంకా ఏమేం చేస్తున్నారు?"

"ఇప్పటికివే. ఇంకా చాలాచాలా చేయాలనే వుంది. అయితే, అవి పెద్ద పెద్ద పనులు ఒక్కడివల్ల అయ్యేవి కాదు. నాతో మరో నలుగురైదుగురు కలిస్తే చేయొచ్చు -"

"ఎట్లా?" కుతూహలం వ్యక్తపరిచాడు కృష్ణ.

"ఏం? మీరు నాతో కలుస్తారా?" గుడిసెదిక్కుగా దారితీశాడు ప్రభాకర్.

"కలుద్దామనే." అతడిని అనుసరిస్తూ అన్నాడు కృష్ణ. "ఈ ఏడు పరీక్ష పోయేట్టుంది. పోతే ఇంటిదగ్గర వుండే పరీక్ష పూర్తిచేసుకొంటాను. ఆపైన చదివే ఉద్దేశ్యం మరిలేదు. ఇంటిదగ్గరవుండిపోయి మీలాగా నాలుగు పనుల్లో తలదూర్చి చూద్దామని అనుకొంటున్నాను.

"ముందు మీ ఆలోచనలేమిటో చెప్పండి" అన్నాడు ప్రభాకర్.

"నాకే కాక అందరికీ లాభసాటిగా ఉండే పనేదైనా చేస్తే బాగుంటుందనిపిస్తుంది."

"అయితే మీ ఊహకు నా పథకాలు సరిపడతాయి... మల్టీపర్పస్ ఫార్మ్ పెట్టామంటే మనం లాభం పొందుతాం - వస్తోత్పత్తికి తోడ్పడి దేశసంపద పెంపొందించిన వాళ్ళమూ అవుతాము. దానికి సంబంధించిన ప్లాన్ కాగితం నా దగ్గర వుంది. చూడండి.'' గుడిసెలోకి వెళ్ళి కొన్ని పత్రికలు తిరగేసి ప్లాన్ కాగితం పట్టుకువచ్చి కృష్ణకు అందించాడు.

కొన్ని ఎకరాల స్థలంలో - కోళ్ళు, బాతులు, పందులు, తేనెటీగలు, చేపలు - వీటిని విడివిడిగా పెంచడం - ఇంకా చాలానే వున్నాయి. వాటి పర్యవేక్షణకు ఒక ఆఫీసు

గది అక్కడే - ప్లానంతా చాలా వివరంగా, చక్కగా వుంది.

"చాలా బాగుంది. చేసిచూద్దాం."

"మీకు నచ్చితే చెప్పండి. మరో ఇద్దరు పార్టనర్స్‌ను చూస్తాను.''

"చూడండి. ఓ శుభముహూర్తం చూచి మల్టీపర్‌పస్‌ఫార్మ్‌ను ప్రారంభిస్తే నిజంగా ఎంత బావుంటుంది!" అన్నాడు కృష్ణ.

గుంజలకు కట్టేసిన రెండు గిత్తల ముందూ పచ్చిగడ్డి పరకలు విదిలించి తృప్తిగా వాటి వెన్ను తట్టాడు ప్రభాకర్. ఆ రెండుగిత్తలు పదిహేనువందలు పోసి మొన్న ప్రక్క గ్రామంలో జరిగిన సంతలో కొన్నాడు.

నందుల్లా వున్న ఆ గిత్తలూ, రేపో మాపో రాబోతున్న నీళ్ళ యింజనూ, ఈ మధ్యనే అయిదువేలుపోసి కొన్న వరి పొలం, ఏటా పది పన్నెండువేలుపలికే తోటా, పుట్లధాన్యం రాలుస్తున్న పంటలూ - అదృష్టచక్రం తిరగడమంటే ఏమిటో ప్రత్యక్ష నిదర్శనంగా వుంది ప్రభాకర్ జీవితం.

ఈసారి పంట, తోటమీద రాబడీ - అప్పులు, అవసరాలు అన్నీ పోగాకూడా అయిదారువేలు నిలువ వుండే అవకాశం కనిపించడంతో మెల్లగా చెల్లెలి వివాహ విషయంమీద దృష్టిని మళ్ళించాడు ప్రభాకర్. ఈ రెండుమూడేళ్ళుగా కాళ్ళు చేతులు కూడదీసుకొనే ప్రయత్నంలో పడి ఆ విషయమే ముందు వేసుకోలేదు. తల్లిదండ్రులుకూడ తాపత్రయం వ్యక్తపరచ లేదు - పరిస్థితులు చక్కబడితే ఆ పిల్ల పెళ్ళి సులభంగా దాటిపోవచ్చుననేమో.

చెల్లెలి వివాహ విషయం తలపెట్టగానే యోగ్యుడైన వరునిస్థానంలో అతడి మిత్రుడు వేణు మెదిలాడు. తల్లిదండ్రుల అంగీకారం తీసుకొనడం ఇదివరకే అయ్యింది. ఇక వేణును కదిలించడమే మిగిలింది.

ఈ మధ్యనే శుక్రవాళ్ళనంతా కూడదీసి స్థాపించిన లైబ్రరీకి వెళ్ళి ఓ అర్ధగంట దిన, వార పత్రికలు తిరుగవేసి వేణుకోసం బయల్దేరాడు ప్రభాకర్.

"వేణు లేడా, అత్తా?"

"లేడు. వరికోసి కుప్పవేశారుకదా? మూడురోజులనుండి వాడు ఇంటికే రావడం లేదు. అక్కడే వుంటున్నాడు. ప్రమీల చేత అన్నం కారియర్ పంపించాను ఇప్పుడే."

ప్రభాకర్ యివతలికి వచ్చాడు. గోపాలం ఇంటిముందు పెళ్ళిపందిరి దించుతున్నారు. మూడుసార్లు మెట్రిక్‌లేషన్ తప్పి ఇంటిదగ్గర పనిమాలి కూర్చున్న ఓ బడుద్ధాయితో సరళపెళ్ళి చిత్రంగా జరిగిపోయింది.

ముందు అన్నివిధాలా యోగ్యమైన సంబంధమే నిశ్చయమైది ఆ పిల్లకు, పదివేల కట్నంతో. వాళ్లు పెళ్ళికి తరలి వస్తూంటే ఏవేవో దుశ్శకునాలు ఎదురయ్యాయట. దారిమధ్య పెళ్ళికొడుకు చావు పెంట్రుక వాసిలో తప్పిపోయినదట. "మీ పిల్ల జాతకం మంచిది కానట్టుంది. మీ సంబంధం మా కక్కరలే"దంటూ కబురు చేశారు వాళ్ళు.

గోపాలం అవస్థ వర్ణనాతీతం. "ఈ క్షణం ఇరవై వేలు చేతిలో పోస్తాను వచ్చి పిల్ల మెడలో తాళికట్టు" అంటూ వచ్చి ప్రభాకర్ కాళ్ళుచేతులు పట్టుకు బ్రతిమిలాడాడు.

"నీ డబ్బుకు మా పిల్లాడు అమ్ముడు పోడు. మీ అంతస్తుకు తగిన మరోసంబంధం చూచుకో వెళ్ళి" అని విదిలించికొట్టారు ప్రభాకర్ తల్లిదండ్రులు.

మౌనంగా అతడినుండి తప్పించుకొని బయటపడ్డాడు ప్రభాకర్.

అదే ముహూర్తానికి, చదువు సంధ్యలు లేని చవటకు పదివేల కట్నమిచ్చి కన్యాదానం చేశాడు గోపాలం, మరో గత్యంతరం లేక.

'అతడి కుసంస్కారానికి, మాట నిలకడలేని తనానికి అలాంటి శాస్తి జరగవలసిందే!' అనుకొంటూ వేణు పొలందిక్కుగా దారితీశాడు ప్రభాకర్.

అన్నగారికి భోజనంపెట్టి తిరిగివస్తూన్న ప్రమీల దారిలో ఎదురుపడింది. ఈ మధ్య చాలారోజులుగా వేణు ఇంటికి వెళ్ళడం పడక ప్రమీలను చూచే అవకాశం కలుగ లేదు ప్రభాకర్‌కు.

వరిచేను మధ్య ఒకరు నడిచే ఒడ్డుమీద ఎదురుపడిన ప్రమీల ప్రభాకర్‌ను చూచి సిగ్గుతో తడబడింది.

"అన్నయ్య పొలందగ్గరే వున్నాడా?" మరోవిధంగా పలుకరించేందుకు మాట దొరక్క అడిగాడు ప్రభాకర్.

"అవును."

బక్కపలుచగా వున్న ఆ పిల్ల ఈమధ్య బాగా ఒళ్ళుచేసినట్టుంది. సాయం సంధ్య వేళ అప్పుడే రేకులు విచ్చుకొంటూ ఘుమ్మని గుబాళించే మల్లిపూవు సౌందర్యం గుర్తు వస్తూన్నది-ఆమెను చూస్తుంటే.

ఎవరో ఒకరు ఒడ్డుదిగి మడిలో కాలు వుంచనిదే ముందుకు పోయేట్టులేదు. ప్రమీలే క్రిందికి దిగబోయింది. ఆమెను వారిస్తూ జోళ్ళు చేతికి తీసుకొని బురదలో ఒక అడుగువేసి తిరిగి ఒడ్డుఎక్కి ముందుకు సాగాడు.

వరికుప్ప దగ్గర ఉన్నాడు వేణు.

"నీ కోసం ఇంటికి వెళ్ళాను. చేను దగ్గరే వున్నాడని చెప్పింది అత్త... ఎలా వుందీసారి పంట? ఎన్ని బస్తాలు కావచ్చు?"

కాస్సేపు పంటలూ, లాభనష్టాల గురించీ మాట్లాడుకొన్నారు స్నేహితులిద్దరూ.

అనుకోకుండా చెల్లెలి వివాహ ప్రసక్తి వేణునుండే రావడంతో తను వచ్చినపని బయట పెట్టడానికి సంకోచపడాల్సిన అవసరం లేకుండా పోయింది ప్రభాకర్‌కు.

"ఈ సారి ప్రమీల పెళ్ళిప్రయత్నాలు గట్టిగా చేయకపోతే అమ్మ బ్రతుకనిచ్చేట్టు

లేదు. అయిదువేలు చేతిలో వుంచుకొన్నా మరో మూడు నాలుగువేలు అప్పుచేయక తప్పేట్టు లేదు." అన్నాడు వేణు.

"నీకూడా నిశ్చయమైతే నీకు వచ్చేది, నీచెల్లెలిపెళ్ళికి కలిసివచ్చి ఖర్చులు మిగులుతాయిగా?" ఇక స్నేహితుడి ఆంతర్యం బయటపడదా-అనుకొన్నాడు.

''అదెలా? డబ్బుముఖంచూచి పెళ్ళిచేసుకొంటామా? ఆడపిల్ల పెళ్ళిగనుక తప్పక ఇచ్చుకొంటాం కట్నం. డబ్బు వస్తుందన్న ఆశతో పిల్ల రూపురేఖలూ, గుణసంపదా చూచుకోకుండా తాళిగట్టేస్తామా?''

''అదే ఆదర్శం మన పిల్లనిచ్చేచోట కూడ వుండాలి. మనం ఎలా డబ్బుతీసుకోకుండా పెళ్ళి చేసుకోవాలనుకొంటున్నామో అలాగే వరకట్నం పేరులేకుండా పిల్లను ఒక ఇంటికి పంపడం జరగాలి. మనం తీసుకోకూడదూ; ఇవ్వనూ కూడదు. అంతగా యివ్వాలనుకొంటే ఆడపిల్ల సంసారానికి కావలసిన అవసరమైన వస్తువులు పెళ్ళిసమయంలో చదివించుకోవచ్చు. అది ఎంతైనా గౌరవప్రదంకూడా.''

"తీసుకోకపోవడంలో ఎంత ఆదర్శం వుందో ఇవ్వకపోవడంలోనూ వుంది. బాగుంది. కాని, వరకట్నం లేకుండా పెళ్ళికి ఒప్పుకొనే దెవడు ఈ లోకంలో?" అది కాని పని అన్న నిస్పృహతో అన్నాడు వేణు.

''నువ్వులేవూ? నీలాంటివాడు దొరికినప్పుడే చెయ్యి నీ చెల్లెలిపెళ్ళి."

''పిల్లికీ, పిడుక్కూ ఒకటే మంత్రమంటే కుదరదులే. నీ చెల్లెలికి వరకట్నం ఇవ్వకుండానే పెళ్ళి చేయగలవా ఏం?''

"నీలాంటి ఆదర్శమూర్తి దొరకగా నాకు వరకట్నం చింతేమిటి?''

పరిహాసంగా అంటున్నాడేమో-అనుకొన్నాడు వేణు.



"నేను నిన్ను ప్రత్యేకంగా కలవడానికి వచ్చిందే ఇందుకోసమయ్యా, వేణూ! ఇప్పుడు చెప్పు. కానీ కట్నం యివ్వను. మా ఇంటి అల్లుడివి అవుతావా, లేదా?"

ప్రభాకర్ చెల్లెలిని వేణు చూచాడుగాని ప్రత్యేక దృష్టితో చూచే అవసరం కలుగలేదు. ప్రభాకర్ మాటతో ఒకసారి ఆ పిల్ల అందచందాలు ఆత్మావలోకనం చేయక తప్పిందికాదు. అపురూప లావణ్యవతి కాదుగాని, రూపులకు బాగానే వుంటుంది. ఇంట్లో పనీ పాట, మంచీ మన్నన తెలిసిన పిల్ల.

"చేసుకోడానికి అభ్యంతరం లేదుకాని, ముందు మా ప్రమీల పెళ్ళి కానీ."

"తప్పుకోడానికి ఇంతకంటే సాకు దొరకదు కాబోలు!"

"సాకేమిటి నీమొహం! చేసుకొంటానురా, మా చెల్లెలిపెళ్ళి అయ్యాక చేసుకుంటాను.''

"నీచెల్లెలికి వరుడు దొరికేదెప్పుడో, పెళ్ళి అయ్యేదెప్పుడో? అంతవరకూ మాకు ఓపిక ఉండవద్దూ? తయారుగా నేను వున్నానుగా? నన్నుపట్టి పెళ్ళి చేయరాదూ? రెండు ముహూర్తాలూ వచ్చేనెలలో పెట్టుకొని ఒక ఇంటివాళ్ళమై పోవచ్చు."

"పరిహాసమా?"

"ఇలాంటి వాటిలో పరిహాసమేమిటి? నిజంగానే నీకిటువంటి ఆలోచన కలిగిందంటే అది, ఆ యిద్దరి ఆడపిల్లల కళ్యాణబలమూ, వాళ్ళ అదృష్టమూ అయిఉండాలి-తప్ప వేరేమీలేదు" అన్నాడు వేణు తృప్తిగా.